జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి


ప్రతి అక్షరం ప్రజలకోసం

## కరీంనగర్

జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి

బుధవారం, మార్చి 27, 2024 పేజీలు - 8





06

పోలింగ్ సిబ్బంది మొదటి దశ

### ర్యాండమైజేషన్ పూర్తి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- మొదటి దశ పోలింగ్ సిబ్బంది రాండమైజేషన్ నిర్వహించిన కలెక్టర్

# మొదటి దశ ర్యాండమైజేషన్ పూర్తి

**జగిత్యాల జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా**

ఉమ్మడి కరీంనగర్ బ్యూరో/జగిత్యాల:– మార్చ్ 26 (ప్రజా జ్యోతి): లోకసభ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా మంగళవారం రోజున పోలింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ పోలింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. జగిత్యాల జిల్లాలోని జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో గల పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు పీ.ఓ, సహాయ ప్రిసైడింగ్ అధికారులు ఏ.పీ.ఓలను, ఇతర పోలింగ్ అధికారులు ఓ.పీ.ఓలను ర్యాండమైజేషన్ నిర్వహించారు. రిజర్వ్ సిబ్బందిని కలుపుకుని జిల్లా పరిధిలోని మూడు సెగ్మెంట్లకు గాను మొత్తం 4544 మంది పోలింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ జరిపారు. వీరిలో పీ.ఓలు 1136 మంది, ఏ.పీ.ఓలు 1136 , ఓ.పీ.ఓలు 2272 మంది ఉన్నారు. పోలింగ్ సిబ్బందికి ఎంపిక చేసిన వివిధ కేంద్రాలలో మాస్టర్ ట్రైనర్స్ చే పోలింగ్ మిగతా 2లో..



# ఎండుతున్న పంటలు మండుతున్న ఎండలు

- సాగు నీటికి తండ్లాడుతున్న అన్నదాత
- వేసంగి రైతుల వ్యతలు వర్ణనాతీతం
- మంథని,ముతారం మండలాల్లో 31వేల ఎకరాల్లో వరిసాగు

మంథని,మార్చి 26 (ప్రజా జ్యోతి): కష్టాల కడలిలో కన్నీటి సాగు చేస్తున్న వరి పంట వేసిన రైతుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి.వేసంగికి సాగునీరు అందక రైతుల కళ్ళల్లో కన్నీళ్లు సుడులు తిరుగుతున్నాయి. ముత్తారం మండలంలో 10,712 ఎకరాల్లో వరి,95 ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశారు. మంథని మండలంలో 20,451 ఎకరాల్లో వరి,10 ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశారు. గత సంవత్సరం వేసంగికి ఎస్సారెస్పీ డి 83 కాలువ ద్వారా సాగునీరు అందించారు. గత సంవత్సరం దసరా పండుగకు ముందే వానలు వెనుక పట్టు మిగతా 2లో..

# నార్మల్ డెలివరీలపై దృష్టి సారించండి

- 24/7 అత్యుత్తమ సేవలు అందించండి
- గర్భిణీలకు పోషకాహారంపై అవగాహన కల్పించండి
- వడదెబ్బ నివారణకు చర్యలు తీసుకోండి..
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
- గుండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శన



కరీంనగర్, మార్చి 26, (ప్రజాజ్యోతి): వైద్య సిబ్బంది 24 గంటల పాటు అందుబాటులో ఉంటూ ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించాలని, ముఖ్యంగా నార్మల్ డెలివరీలపై దృష్టిసారించాలని మిగతా 2లో..



# అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవు

**తహశీల్దార్ మహేష్** | **10 ట్రాక్టర్ల పట్టివేత**

వేములవాడ, మార్చి 26, (ప్రజాజ్యోతి): గృహ అవసరాల నిమిత్తం మూల వాగు నుండి ఇసుక తరలిస్తు ప్రభుత్వ చలాన్ చెల్లించి నప్పటికీ ఒకదానితో రెండు మూడు ఇసుక ట్రిప్పులు జార వేస్తుండగా మరో అడుగు ముందుకేసి సమయం గడిచిన తర్వాత కూడా తరలిస్తుండగా మంగళవారం వేములవాడ తహసిల్దార్ మహేశ్ తన సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీ



చేశారు. సమయం మూడు గంటల వరకే అనుమతి ఉండగా ఆ తదుపరి కూడా అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పది వాహనాలను పట్టుకొని సీజ్ చేశారు. గత కొన్ని రోజులుగా ఈ అక్రమ తతంగం కొనసాగుతుండగా ఇప్పటికీ వ్యవహారంలో పోలీసులపై కూడా వేటుపడింది. ఈ విషయమై తహసీల్దార్ మహేశ్ ను వివరణ కోరగా మూడు గంటల వరకే సమయం ఇచ్చినప్పటికీ సమయం గడిచిన తర్వాత కూడా తరలిస్తున్న నేపథ్యంలో 10 వాహనాలను పట్టుకున్నామని తెలిపారు. గతంలో ఏమైనా కేసులు ఉన్నాయా లేవా పరిశీలించి ఫైన్ వేస్తామని తెలిపారు.

# కొనుగోలు కేంద్రాలను ప్రారంభించండి




### పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టండి

### తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడండి

### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ శాంతి కుమారి

కరీంనగర్, మార్చి 26, (ప్రజాజ్యోతి): అన్ని జిల్లాల్లో ఏప్రిల్ ఒకటి నుంచి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ శాంతి కుమారి కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని అన్నీ జిల్లాల కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లతో వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, తాగునీటి సరఫరా పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండేలా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఐకేపీ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలన్నారు. కేంద్రాల వద్ద ఏదైనా సమస్యలు తలెత్తితే వెంటనే వాటిని పరిష్కరించాలని పేర్కొన్నారు. గన్నీ సంచులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల్లో నిర్దేశించిన సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ప్రణాళికతో కొనుగోలు మిగతా 2లో..

## మొదటి దశ ర్యాండమైజేషన్ పూర్తి



మొదటిపేజీ తరువాయి..
నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని పోలింగ్ విధుల కోసం నియమించబడిన సిబ్బందికి తక్షణమే ఉత్తర్వులు అందజేయాలని అధికారులను ఆదేశించారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో ఆర్డీఓ లు మధుసూదన్, ఆనంద్ కుమార్, శ్రీనివాస్, కలెక్టరేట్ పరిపాలన అధికారి హన్మంతు రావు, సంబంధిత తహశీల్దార్లు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు హకీమ్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## నార్మల్ డెలివరీలపై దృష్టి సారించండి



మొదటిపేజీ తరువాయి..
జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మంగళవారం రామడుగు మండలం గుండి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంత మంది మహిళలు హాస్పిటల్ కు వస్తున్నారు.. మందులు అందుబాటులో ఉన్నాయా, సేవలందిస్తున్న తీరు తో పాటు తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానల్లో సకల వసతులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో ఎక్కువగా సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని సూచించారు. గర్భిణీలకు పోషకాహారం తీసుకునే విధానంపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలని, తద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. రక్తహీనత నివారణకు మహిళలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. గర్భిణులకు యోగా, హెల్త్ డైట్ పై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలకు వైద్య పరంగా సేవలు చేయడం వరమని, మెరుగైన సేవలందిస్తే మంచి గుర్తింపు వస్తుందని తెలిపారు. స్టాఫ్ నర్స్, ఎంఎల్ హెచ్పీ డాక్టర్ల ను భర్తీ చేసి వైద్య సేవలకు ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. ఎండాకాలం నేపథ్యంలో మహిళలు, వృద్ధులు, విద్యార్థులు వడదెబ్బకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ మేరకు ఉపాధి హామీ కూలీలకు పని స్థలాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని సూచించారు. అదేవిధంగా పదో తరగతి పరీక్ష రాస్తున్న విద్యార్థులకు పాఠశాలల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆపరేషన్ థియేటర్ గది, ఇన్ పేషెంట్ గది, ఫార్మసీని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. మందులు అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. మందులకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత, తహసీల్దార్ భాస్కర్, ఎంపీడీవో రాజేశ్వరి, గుండి పీహెచ్సి వైద్యాధికారి గ్రీష్మన్య, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ పూర్తి

**కలెక్టర్, ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి**

సిరిసిల్ల, మార్చి 26, (ప్రజాజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసామని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ ఎన్ఐసివిసిహాల్ లో సంబంధిత అధికారులతో కలిసి ఎన్ఐసి వారు రూపొందించిన సాఫ్ట్ వేర్ వినియోగిస్తూ ఆన్లైన్లో పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి మాట్లాడుతూ జిల్లాలో సిరిసిల్ల , వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 560 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వీటిలో 674 ప్రిసైడింగ్ అధికారి,674 సహాయక ప్రిసిడింగ్ అధికారి,1348 ఓపిఓలు మొత్తం 2696 లను కేటాయించడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు ప్రకారం 20% అదనంగా సిబ్బంది కేటాయింపు ప్రక్రియ చేపట్టామని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఓ శ్రీనివాస చారి, డిఈఓఈడి ఎం శ్రీనివాస్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలను ప్రారంభించండి

మొదటిపేజీ తరువాయి..
కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు ప్రతి మండలంలో ఏప్రిల్ ఒకటిన ఒక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మిగతా చోట్లా ఏప్రిల్ 10 వరకు పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని పేర్కొన్నారు. అదేవిధంగా ఆయా జిల్లాలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం అన్నారు.జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూవేసవి కాలం నేపథ్యంలో కరీంనగర్ జిల్లాలో తాగునీటి సరఫరాకు ఎక్కడ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. కరీంనగర్ కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చేపట్టిన చర్యలను వివరించారు. జిల్లాలోని గ్రామాలతోపాటు కరీంనగర్ కార్పొరేషన్,






కొత్తపల్లి, చొప్పదండి, హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల్లో తాగునీటికి ఎక్కడ ఏ ఇబ్బంది రాకుండా చూస్తున్నామని తెలిపారు అవసరం ఉన్న చోట ముందస్తు పనులు చేపడుతూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. తాగునీటి సరఫరాపై ప్రతిరోజు సమీక్ష నిర్వహిస్తూ పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నామని చెప్పారు. ప్రతి గ్రామాన్ని సందర్శిస్తూ ముందస్తు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా ప్రత్యేక దృష్టి సారించామని కలెక్టర్ వివరించారు. అవసరమైన చోట బోర్ వెల్స్, పైప్ లైన్లు ఏర్పాటు చేయడంతో పాటు మరమ్మతు పనులు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. తాగునీటికి ఇబ్బంది రాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణ్, వ్యవసాయ అధికారి శ్రీనివాస్, మార్కెటింగ్ అధికారి పద్మావతి, డిపిఓ రవీందర్, డిఆర్డిఓ శ్రీధర్, డి సి ఎస్ ఓ గౌరీ శంకర్, సివిల్ సప్లై డిఎం రజనీకాంత్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎండుతున్న పంటలు.. మండుతున్న ఎండలు

మొదటిపేజీ తరువాయి..
పట్టడంతో సాగునీటి ఎద్దడి ఏర్పడింది. దీనికి తోడు కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు కుంగడంతో గోదావరిలో నిల్వ చేసిన నీటిని కిందికి వదిలివేశారు. దసరా నుంచి వానలు లేక గోదావరిలో నీరు లేక ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుంచి నీరు రాక వేసంగి రైతులు అరిగోస పడుతున్నారు. బోర్ల కింద వేసిన వరి పంట బోర్లు అడుగంటడంతో సాగునీరు అందడం లేదు. ఎస్సారెస్పీ నీరు వస్తుందని కొండంత ఆశతో ఎదురుచూసిన రైతులకు నిరాశే ఎదురయింది. వేసంగి వరి పంటకు సాగునీరు అందించాలని మంథని మండల రైతులు రెండుసార్లు రోడ్లపైకి వచ్చి ధర్నా నిర్వహించారు. సాగునీటి సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదు. చొప్పదండి మండలం రేవెళ్ళ వద్ద ఎస్సార్ బి ద్వారా నీటిని సరఫరా చేయాల్సి ఉండగా జగిత్యాల జిల్లా కాకతీయ జోన్ –2 ద్వారా పెద్దపల్లి మంథని నియోజకవర్గ ప్రాంతాలకు సాగునీరు సరఫరా చేయాల్సి ఉన్నది. అయితే జోన్ –1 ద్వారా ఎస్సారెస్పీ నీటిని తరలించడంతో కమాన్పూర్ మండలం గుండారం చెరువులోకి నీరు అందలేదు. గుండారం చెరువులో నీటి నిలువ సామర్థ్యం 12 అడుగుల వరకు ఉండాల్సి ఉండగా 6 అడుగుల వరకే పరిమితమైంది. జో – 1 నిలిపివేసి జోన్ –2 ద్వారా గుండారం చెరువులోకి నీళ్లు మళ్లించినా పది అడుగుల మేరకే నీరు చేరుకుంది. ఈ దశలో వేసంగి వరి పంటకు సాగునీటి లభ్యత కష్టసాధ్యమైంది. అధికారులు కూడా చేతులెత్తేయడంతో రైతులు నిండా మునిగిపోయారు.వేలాది రూపాయలు పెట్టుబళ్లు పెట్టి పైరును కాపాడుకున్న రైతులు కళ్ళముందే పంట ఎండిపోవడంతో లబోదిబోమని గుండెలు బాధుకొంటున్నారు. ఇంకొందరు అందుబాటులో ఉన్న నీటి వనరులను పొలాలకు తరలించేందుకు నానా కష్టాలు పడుతున్నారు. అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో రైతులు విస్తీర్ణానికి మించి వేసంగి పంట వేయడంతో ఇబ్బందులకు గురికావలసి వచ్చింది. అధికారులు సాగునీటి ఎద్దడిని పసిగట్టి ముందే రైతులకు ప్రచార, ప్రసార సాధనాల ద్వారా సమాచారం అందించినట్లయితే రైతులు నష్టాలకు గురి అయ్యేవారు కాదని వ్యవసాయ సంఘాల నాయకులు అంటున్నారు.



**ప్రభుత్వం ఆదుకొని పంట నష్టం చెల్లించాలి**
**ఎరుకల బాలరాజు, రైతు, గంగాపురి.**

మంథని శివారులోని రెడ్డి చెరువు కింద తాను ఐదు ఎకరాలలో వరి పంట వేశానని పంట కలుపు దశలో నీటి ఎద్దడి ఏర్పడిందని అన్నారు. తన పొలానికి దగ్గరలో ఉన్న బొక్కల వాగు నుంచి పైప్ లైన్ ద్వారా సాగునీరు





తరలించేందుకు ప్రయత్నిస్తున్నానని అన్నారు ఇప్పటికి తాను 1,50,000 పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. వేసంగి పంట చేతికి వస్తుందని ఆశ లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం సమగ్ర సర్వే నిర్వహించి పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని కోరాడు.

**పంట నష్టపోయి రెండున్నర ఎకరాల పొలం అమ్ముకున్నాను.**
**ఎరుకల శంకర్, రైతు, గంగాపురి.**


తనకు రెడ్డి చెరువు కింద రెండున్నర ఎకరాల పొలం ఉండేదని ఏటా పంట నష్టపోవడంతో అప్పుల బాధకు పొలం అమ్మేసి అప్పుడు తీర్చాలని ఎరుకల శంకర్ వాపోయాడు. వ్యవసాయాన్ని నమ్ముకుని జీవించడం కష్టంగా ఉందని నిరాశను వ్యక్తం చేశాడు. ఏటా పంట నష్టపోయి తాను వ్యవసాయ కూలిగా మారి తన కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు తెలిపారు.

# ఇన్ టైంలో అనుమతులు ఇవ్వండి

**జాప్యం చేయవద్దు**
**కలెక్టర్ పమేలా సత్పతి**

కరీంనగర్, మార్చి 26, (ప్రజాజ్యోతి): ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆయా రాజకీయ పార్టీల నాయకులు ప్రచారానికి సంబంధించి దరఖాస్తు చేసుకున్న వాటికి ఇన్ టైంలో అనుమతులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన మొదటి విడత పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పోలింగ్ సిబ్బంది కేటాయింపునకు సంబంధించిన వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సువిధ కింద ఎన్నికల ప్రచారం, సభలు, సమావేశాలు, ర్యాలీలు జరుపుకునేందుకు అనుమతి కోసం రాజకీయ పార్టీల నాయకులు ఆన్లైన్లో దరఖాస్తు






చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు అధికారులు చెక్ చేసుకోవాలని పేర్కొన్నారు. తర్వాత వాటికి సంబంధించిన అనుమతులు వెంటవెంటనే ఇన్ టైంలో ఇవ్వాలని ఆదేశించారు. ఎక్కడ జాప్యం జరుగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. దీంతోపాటు సువిధ కింద రాని వాటికి సంబంధించిన అనుమతులపై సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించాలని తెలిపారు. ఎన్నికల కోడ్ ను అధికారులు అందరూ పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. అందరూ అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కోడ్ ఉల్లంఘన పై వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్, డీఆర్ఓ పవన్ కుమార్, సీపీఓ కొమురయ్య, డీపీఓ రవీందర్, డీఐఓ శివరాములు, ఎస్వో దత్తారెడ్డి, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## జువాడి జువ్వాడి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన శివాజీ నగర్ యూత్ సభ్యులు

మెట్ పల్లి ప్రతినిధి మార్చి 26 ( ప్రజా జ్యోతి) : మెట్ పల్లి పట్టణంలో శుక్రవారం కొట్టాల రవి, కందుల శ్రీను ఆధ్వర్యంలో శివాజీ నగర్ కు చెందిన పలువురు యూత్ సభ్యులు కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సీనియర్ పార్టీ కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి నర్సింగరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నరసింగరావు వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో పార్లమెంట్ అభ్యర్థుల కొరకు తమ వంతు బాధ్యతగాఎంపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓంకారి చిన్న అంజయ్య ఓంకారి గంగారెడ్డి కందుల లక్ష్మణ్ కొట్టాల శేఖర్ మార్గం శ్యామ్ లతోపాటు నాయకులు పాల్గొన్నారు

## ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి 23వ వార్డులో పర్యటించిన ఎమ్మెల్యే



మెట్ పల్లి ప్రతినిధి మార్చ్ 26 ( ప్రజా జ్యోతి) : ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి మెట్ పల్లి పట్టణంలోని 23 వార్డులో శుక్రవారం కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఉదయం మార్నింగ్ వాకింగ్ కార్యక్రమంలో భాగంగా వార్డు సమస్యలను ప్రజల వద్దకువెళ్లితెలుసుకున్నారు. సమస్యల పట్ల అప్పటికప్పుడు ఉన్నత అధికారులతో వెంటనే వారికి ఫోన్ చేసి త్వరగా మస్యలుపరిష్కరించాలనికోరారు.ఈకార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బోయినపల్లి చంద్రశేఖర రావు, వార్డు కౌన్సిలర్ ఒజ్జల బుచ్చిరెడ్డి, కిషోర్, రాజారాం, పూదరి సుధాకర్ గౌడ్,ఓజ్జలా శ్రీనివాస్ తో పాటు అధికారులు,వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు

కథలాపూర్, మార్చి 26(ప్రజాజ్యోతి): మండల పరిధిలోని తాండ్రియాల ఎక్స్ రోడ్ వద్ద ప్రయాణికుల దాహర్తీ తీర్చేందుకు అరుణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవికాలంలో పాదచారులకు, ప్రయాణికులకు దాహార్తిని తీర్చేందుకు పానుగంటి అరుణ్ పుట్టిన రోజు సందర్భంగా తన జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు శ్యామ్ తెలిపారు. ప్రయాణికులు చలివేంద్రాన్ని వినియోగించుకోవాలని కోరారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవాకార్యక్రమాలు చేపడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గడీల గంగప్రసాద్, ఉరుమల్ల చారీ, పానుగంటి భుమగంగారం, పానుగంటి సాగర్, పంజాల మారుతి, నక్క నర్సయ్య, పాలేపు రాజేష్, పానుగంటి గంగాధర్, మామిడిపెల్లి గంగాధర్, మైస రెడ్డి, ప్రేమ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



# క్రీడా పోటీల్లో విద్యార్థులు రాణించాలి

**అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ ఎన్టిపిసి సిఎస్ఆర్ - సి.డి.ద్వారా చేపట్టిన గ్రామీణ ఆటల పోటీలను ప్రారంభించిన అదనపు కలెక్టర్**





జ్యోతినగర్, (ప్రజా జ్యోతి), మార్చి –26: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో సైతం రాణించాలని,ఆటల పోటీల యందు ఆసక్తి గల వారు పాల్గొంటూ దేశం గర్వ పడేలా పేరు సాధించాలని అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ అన్నారు. మంగళవారం అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ రామగుండంలోని ఎం.జి. స్టేడియంలో ఎన్టిపిసి సిఎస్ఆర్ – సి.డి ఆధ్వర్యంలో 20 జిల్లా ప్రజా పరిషత్ విద్యార్థినీ, విద్యార్థులకు ఏర్పాటు చేసిన గ్రామీణ ఆటల పోటీలను ఎన్.టి.పి.సి (ఆర్&టి) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ, క్రీడలపై ఆసక్తి ఉన్నవారిని ప్రోత్సహించడం వలన అద్భుతమైన ప్రతిభ ప్రదర్శిస్తూ విజయం సాధించే అవకాశం ఉంటుందని అన్నారు. విద్యతో పాటు క్రీడలపై సైతం విద్యార్థులు శ్రద్ధ వహించాలని ప్రతిరోజు కొంత సమయం క్రీడలకు కేటాయిస్తే మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. విద్యార్థుల క్రీడాభివృద్ధికి జిల్లా యంత్రాంగం అవసరమైన అన్ని రకాల సహాయ, సహకారాలు అందిస్తూ అండగా ఉంటుందని అన్నారు . ఎన్.టి.పి.సి సి.ఎస్.ఆర్.(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) క్రింద అనేక కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తుందని అన్నారు. క్రీడల పోటీలలో పాల్గొనే విద్యార్థినీ, విద్యార్థులకు ట్రాక్ సూట్స్, భోజన సదుపాయం కల్పించడం జరిగిందని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్.టి.పి.సి (ఆర్&టి) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు మాట్లాడుతూ, ఎన్టిపిసి సిఎస్ఆర్ ద్వారా ఈ ప్రాంత అభివృద్ధికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని, ముఖ్యంగా విద్య, వైద్యం, ప్రాథమిక సౌకర్యాల కల్పన, ఒకేషనల్ ట్రైనింగ్, కళలు, నీరు, శానిటేషన్ పై కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందని అన్నారు. గ్రామీణ క్రీడా పోటీలలో 20 పాఠశాలల నుంచి సుమారు 800 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొంటున్నారని, నిరంతరం వివిధ క్రీడా పోటీలలో పాల్గొనడం వల్ల విద్యార్థులు ఉత్సాహవంతంగా ఉంటారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం తహసిల్దార్ కుమార స్వామి, రామగుండం మండల విద్యాశాఖ అధికారి సంపత్ రావు, ఎన్టిపిసి జనరల్ మేనేజర్ ప్రశాంత్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గుమ్మడి భేషరతుగా క్షమాపణ చెప్పాలి

**నేతకాని మహర్ సామాజిక వర్గం జాతీయ స్టీరింగ్ కమిటీ చైర్మన్ కనకయ్య**



గోదావరిఖని, మార్చి 26 (ప్రజా జ్యోతి) నేతకాని సామాజిక వర్గాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుమ్మడి కుమారస్వామి భేషరతుగా క్షమాపణ చెప్పాలని నేతకాని మహర్ సామాజిక వర్గం జాతీయ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బంగారు కనకయ్య ,రాష్ట్ర అధ్యక్షులు రాజమల్లు డిమాండ్ చేశారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ పై విమర్శలు చేసిన గుమ్మడి తమ సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు.ఆయన వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఏదైనా ఉంటే రాజకీయంగా ఆరోపణలు చేసుకోవాలని, రాజకీయాలను అడ్డం పెట్టుకొని కులాలను మధ్యలోకి తీసుకురావడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు. చరిత్ర తెలియకుండా గుమ్మడి మాట్లాడారని, అనేక ఉద్యమాలలో నేతకాని సామాజిక వర్గం పాల్గొన్నదని, తెలంగాణ ఉద్యమంలో ముగ్గురు తమ సామాజిక వర్గానికి చెందినవారు అమరులయ్యారని, భద్రాచలం ,ఏటూరి నాగారం, ఉట్నూర్ తదితర గిరిజన పోడు భూములపై ఉద్యమించామని ,తాము స్పందించి సమావేశం ఏర్పాటు చేయడంతోనే అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ స్పందించారని గుర్తు చేశారు. ధర్మపురి నుంచి వలస వచ్చిన గుమ్మడి స్థానికతపై మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఘనమైన చరిత్ర కలిగిన నేతకాని సామాజిక వర్గంపై అవగాహన లేకుండా లేనిపోని ఆరోపణలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. వైసీపీలో ఉన్నప్పుడు కాకా కుటుంబాన్ని విమర్శించిన గుమ్మడి ఇప్పుడు వత్తాసు పలకడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. గుమ్మడి పై తాము కేసు పెడతామని, ఇప్పటికైనా గుమ్మడి తన వైఖరి మార్చుకోవాలని, మరోసారి ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకునేది లేదని వారు హెచ్చరించారు. విలేకరుల ఈ సమావేశంలో నాయకులు దుర్గం ఎల్లయ్య , నర్సయ్య, ప్రభాకర్, ప్రకాష్, ముడిమడుగుల మల్లన్న, రాజమల్లు, దుర్గం నగేష్, జాడి రాజయ్య, కామర శ్రీనివాస్, కామెర పద్మ ,రామ్ టెంకి శ్రీనివాస్ పాల్గొన్నారు.ల

# ఎంపీ గా గెలిస్తే జగిత్యాల నుండి ఢిల్లీకి రైల్వే లైన్ వెయిస్తా

**ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి**



జగిత్యాల టౌన్, మార్చి 26 (ప్రజాజ్యోతి): జగిత్యాల పట్టణంలోని అంగడి బజార్ లోని మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతిలక్ష్మణ్ నివాసంలో పద్మశాలి సంఘ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ కారేక్రమానికి ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి హాజరై మాట్లాడుతూ జగిత్యాల నుండి ఢిల్లీకి రైల్వే లైను వేయిస్తానని ఎంపీగా కొట్లాడే అవకాశం ఇవ్వండని ప్రజలకు సేవ చేయడమే నా లక్ష్యం మంచంలో పడుకొనైనా ప్రజలకు అండగా ఉంటానని తెలిపారు. యావర్ రోడ్డు విస్తరణకు 100 కోట్లయినా కేటాయించి విస్తరిస్తాం నా ప్రతి విజయంలో జగిత్యాల ప్రజలు వెంట ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో అండగా నిలువాలని పిలుపునిచ్చారు. జగిత్యాల ప్రజల రుణం తీర్చుకోలేనిది యుద్ధంలో కొట్లాడేందుకు ఓటు హక్కుతో అవకాశం ఇవ్వండని ప్రజల తరుపున కొట్లాడుతానని అన్నారు. జగిత్యాల అభివృద్ధికి చేయి చేయి కలువండి నా ప్రతి విజయంలో జగిత్యాల పట్టణ ప్రజల మద్దతు ఉందని గుర్తు చేసుకున్నారు. 1996లో రాజకీయాలకు అతీతంగా 54 వేలకు పైగా మెజార్టీతో గెలిచానని అన్నారు. అందరికి ఆపదలో అందుబాటులో ఉండి సేవలందిస్తానని అందరూ తమ బిడ్డగా భావించి ఎన్నికల్లో అండగా ఆపదలో ఉన్న వారికి నా వంతు సాయం అందించానని సమస్య పరిష్కారం కోసం మార్గం చూపుతున్నానని ఎమ్మెల్సీ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో సమస్యల పరిష్కారం కోసం వారధిగా పనిచేసే అవకాశం ఉంది. ఎంపీ ఎన్నికల్లో గెలిస్తే మరింత మెరుగైన సేవలందిస్తా జగిత్యాల పట్టణ ప్రజలకు త్రాగునీటి సమస్య ఏర్పడకుండ చర్యలు చేపట్టవలసిన బాధ్యత మున్సిపల్ చైర్ పర్సన్ పై ఉందని అన్నారు. ఎంపీగా గెలిస్తే జగిత్యాల నుండి మంచిర్యాల మీదుగా ఢిల్లీకి రైల్వే లైను వేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి, గిరి నాగభూషణం, దేశాయి, గాజంగి నందయ్య కౌన్సిలర్స్ వివిధ హోదాలో ఉన్న నాయకులు సంఘ సభ్యులు పాల్గొన్నారు.





## ఘనంగా శ్రీకృష్ణరుక్మిణిల కళ్యాణ మహోత్సవం ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే

కాల్వ శ్రీరాంపూర్ ,(ప్రజా జ్యోతి), మార్చి 26: మండల కేంద్రంలోగల శ్రీ కృష్ణ ఆలయంలో యాదవ కులస్తుల ఆధ్వర్యంలో సోమవారం రోజున శ్రీకృష్ణ రుక్మినీల కళ్యాణ మహోత్సవ కార్యక్రమాన్నిఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి పెద్దపల్లి శాసనసభ్యుడు చింతకుంట విజయ రమణారావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు చేపట్టారు అనంతరం ఎమ్మెల్యేను యాదవ కులస్తులు శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడుగా జన వీణసదయ్య యాదవ్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఎండి రహీం ఖాన్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు సబ్బని రాజమల్లు మాజీ సర్పంచ్ మాదాసి సతీష్ మాజీ ఎంపిటిసి పొట్యాల మొండయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు యాదవ కులస్తులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## యువత పెడదారి పట్టకుండా చూసుకునే బాధ్యత తల్లిదండ్రులదే ఎస్సై సందీప్

**త్రిబుల్ డ్రైవింగ్,మితిమీరిన వేగంతో పట్టుబడితే జైలుకే**




కొడిమ్యాల, మార్చి26, (ప్రజాజ్యోతి): యువత పెడదారి పట్టకుండా చూసుకునే బాధ్యత తల్లిదండ్రులదే నని కొడిమ్యాల ఎస్సై సందీప్ అన్నారు.జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ముఖ్యంగా గంజాయి,డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు,అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని,ఈ విషయంలో తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.యువకులు మితిమీరిన వేగం,ట్రిపుల్ రైడింగ్‌తోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని,మైనర్లు బైక్ నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారని,ఎంతో మంది ప్రాణాలు కొల్పోయి తల్లిదండ్రులకు కడుపుకోతను మిగులుస్తున్నారని అన్నారు.ట్రిపుల్ రైడింగ్,మితిమీరిన వేగం చట్టరీత్యా నేరమని పట్టుబడితే జైలుకెళ్లడం ఖాయమని హెచ్చరించారు.

## రైతు వేదికలో రైతు నేస్తంపై అవగహన

మెట్ పల్లి ప్రతినిధి ( ఇబ్రహీంపట్నం) మార్చి 26 (ప్రజా జ్యోతి) : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కేంద్రంలోని రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమం దృశ్యశ్రవణ మాధ్యమం ద్వారా రైతులకు సమగ్ర వ్యవసాయం డ్రోన్లతో వ్యవసాయం పై ఈ రెండు అంశాల గురించి అవగాహన కల్పించడం జరిగింది.సమగ్ర వ్యవసాయంలో భాగంగా పాడి పశువుల పెంపకం, గొర్రెల పెంపకం కోళ్ళని, చేపల పెంపకంపై గోవర్ధన్ ,శాస్త్రవేత్త వ్యవసాయ పంటలతో పాటు, నాటి పెంపకం చేపట్టిన విభిన్న పద్ధతుల ద్వారా అధిక లాభాలు పొందవచ్చానన్నారు. అలాగే డ్రోన్లతో వ్యవసాయ అనే అంశంపై డాక్టర్ యన్. రామగోపాలశర్మ ప్రధాన శాస్త్రవేత్త, మాట్లాడుతూ వివిధ పంటలపై డ్రోన్ల ద్వారా పురుగు మందులు పిచికారి చేసే విధానం ఆ డ్రోన్ల ద్వారా వరి సాగు చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు.ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దీపిక,ఎఇఓ లు నరేష్, రవళిక, హరీష్,లతో పాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.



# రాజ్యాంగంతో నే రాజకీయంలో ఉన్నారని మర్చిపోయారా!

**రాజ్యాంగం మారుస్తాం అంటే ఊరుకునేది లేదు**
**జిల్లా మాల మహానాడు అధ్యక్షులు చంద్ర**



గంభీరావుపేట మార్చి 26 (ప్రజా జ్యోతి): బిజెపి నాయకులు 400 సీట్లు వస్తే రాజ్యాంగం మారుస్తాం అని ప్రస్తావించడం సిగ్గుచేటు. కర్ణాటక ఎంపీ ఆనంత్ కుమార్ హెగ్డే రాజ్యాంగంపై మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండిస్తూ మంగళవారం రోజున గంభీరావుపేట మండల కేంద్రం లోని అంబేద్కర్ విగ్రహం వద్ద రాజన్న సిరిసిల్ల జిల్లా మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దోసల చంద్ర ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మారుస్తాం అంటేనే ప్రభుత్వం కూలిపోయింది. ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారు ఇచ్చిన ఓటు హక్కు వల్లే ఈనాడు మీరు రాజకీయంగా పార్లమెంట్లో ఉన్నారు. అంబేద్కర్ గారు రాసిన రాజ్యాంగం పై ప్రమాణం చేసిన తర్వాతనే చట్టసభల్లో కూర్చున్నారు. అది మరిచి బిజెపి నాయకులు రాజ్యాంగాన్ని మారుస్తాం అని అనడం దేశానికి తలవంచనియం వారి వ్యాఖ్యలపై ప్రధాని ఎందుకు? ముక్కున వేలు వేసుకొని ఉన్నారు. అలాంటి వాక్యాలు చేసిన వారిని రాజకీయంగా రానివ్వకుండా అడ్డుకుంటాం. నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించేంతవరకు పోరాడుతాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రెడ్డి మల్ల రాజనర్స్ దోశల ఉపేందర్ నల్ల రాజకుమార్ హిట్లర్ మండల నాయకులు గాదం శంకర్ టేకుమల్ల బాలయ్య తోడేటి సుదర్శన్ దోసల రాజు గాదం రాజేందర్ రాములు ముత్తయ్య పాశం లింగం మద్యల రాజు మద్దెల శంకర్ దుబాసి నాంపల్లి దాసరి చంద్ర సురేష్ నల్ల శ్రీధర్ తదితరులు ఉన్నారు.

# టెట్ ఫీజును వెంటనే తగ్గించాలి



**రూ 200 నుండి రూ.వెయ్యికి**
**పెంచడం అన్యాయం**
**సమతా సైనిక్ దళ్ రాష్ట్ర నాయకులు**
**మార్షల్ దుర్గం నగేష్**

జ్యోతి నగర్, (ప్రజాజ్యోతి) మార్చి 26: టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) ఫీజును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలని సమతా సైనిక దళ్ మార్షల్ దుర్గం నగేష్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టేట్ ఫీజు.2 వందల నుండి రూ.వెయ్యికి పెంచడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.. ఈనెల 27 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమవుతుందని, అయితే ఈసారి అప్లికేషన్ ఫీజులు భారీగా పెంచడంతో నిరుద్యోగుల పైన ఫీజుభారం మోపారని ఆవేదన వ్యక్తం చేశారు. టెట్ పరీక్ష ఫీజు 2021లో రూ.200, 2022లో రు.300, గతేడాది 2 పేపర్లకు కలిపి రూ.400 ఫీజు ఉండేదని, ఈ నోటిఫికేషన్ లో ఒక పేపరకు దరఖాస్తు చేసుకంటే రూ.వెయ్యి, రెండు పేపర్లకు రూ.2వేలు చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. ఒకేసారి ఫీజు పెంచడం కారణంగా అభ్యర్థులు అనేక రకాలుగా ఆర్థిక సమస్యలతో ఇబ్బందికి గురవుతారని, ప్రభుత్వం నిరుద్యోగుల పైన అప్లికేషన్ల పేరుతో వసూలు చేసేటటువంటి వైఖరి సరికాదన్నారు.. కాంగ్రెస్ ప్రభుత్వం పోటీ పరీక్షలకు ఎలాంటి అప్లికేషన్ ఫీజులు వసూలు చేయమని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చి, నేడు అప్లికేషన్ల ఫీజు పేరుతో భారీగా వసూలు చేయడం నిరుద్యోగ యువతకు అన్యాయం చేయడమే అని అన్నారు. వెంటనే టెట్ అప్లికేషన్ ఫీజు తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన పద్మశాలి పట్టణ అధ్యక్షులు జక్కుల ప్రసాద్ దంపతులు

**పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన**
**జువ్వాడి నర్సింహారావు**



కోరుట్ల మార్చ్ 206 ప్రజా జ్యోతి: కోరుట్ల పట్టణ పద్మశాలి కులోన్నత సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు జక్కుల ప్రసాద్ దంపతులతో పాటు భారత రాష్ట్ర సమితి పార్టీకి చెందిన వాజీద్ లు మంగళవారం కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారినీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా జువ్వాడి నర్సింహారావు ఆహ్వానించారు. సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఆకర్షితులమై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్టు జక్కుల ప్రసాద్ అన్నారు. నరసింగరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ప్రభుత్వం కొనసాగుతుందని కావున ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు కుల సంఘాల ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం, మహిళా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షురాలు మచ్చ కవిత, కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆడెపు మధు, ఎంబేరి సత్యనారాయణ, మార్గం ప్రతాప్, పోతుగంటి శంకర్ గౌడ్, తుపాకుల బాజన్న ,అవునురి కాశీరెడ్డి, పసుల కృష్ణప్రసాద్ కటుకం దివాకర్, పెంట అశోక్, అంజిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి కాంగ్రెస్ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 6 రోజుల ముందుగానే ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించిన ఓసి5

**అభినందించిన సింగరేణి అర్జీవన్ జిఎం**



గోదావరిఖని, మార్చి 26 (ప్రజా జ్యోతి) 2023–24 ఆర్థిక సంవత్సరం సింగరేణి బొగ్గు అర్జీవన్ ఓసి5 ఆరు రోజులు ముందుగానే ఉత్పత్తి లక్ష్యాలను సాధించింది.సోమవారం అత్యధికంగా ఉత్పత్తి ఉత్పాదకతా సాధించింది. 30 లక్షల టన్నులకు గాను 34,25,895 అదనంగా 116% ఉత్పత్తి సాధించింది. రవాణాలో ఇప్పటివరకు రోజుకు 10 టన్నుల నుంచి 12 టన్నుల బొగ్గు మాత్రమే రవాణా చేసేదని సోమ వారం అత్యధికంగా 16119 టన్నుల బొగ్గు రవాణా చేయడంలో సఫలికృతం అయినట్లు సింగరేణి అర్జీవన్ జిఎం చింతల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఓసిపి 5 అధికారులు, ఉద్యోగులు, యూనియన్ నాయకులు, మహిళా కార్మికులు సూపర్వైజర్ స్టాఫ్,కాంట్రాక్టు ఉద్యోగుల సమిష్టి కృషి శిక్షాలను అధిగమించినట్లు చెప్పారు. సత్ఫాలితాలు సాధించిన ప్రాజెక్ట్ ఆఫీసర్ చంద్రశేఖర్, డీజీఎం రామస్వామి, మనేజర్ అనిల్ గాబలే, గని యాక్టింగ్ మేనేజర్ గంధం రాములు తో పాటు కార్మికులకు జీఎం అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో అధికారులు, ఉద్యోగులు రక్షణతో విధులు నిర్వహిస్తూ లక్ష్యాలను అధిగమించాలని ఆకాంక్షించారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు

కోరుట్ల టౌన్, మార్చి 26(ప్రజాజ్యోతి): కోరుట్ల మండల్ ఐలాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో పిఎసిఎస్ చైర్మన్ సాయి రెడ్డి, తెరాస మండల పార్టీ నాయకులు కుంటాల వికాస్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి నర్సింగరావు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కొంతం రాజం, కాంగ్రెస్ పార్టీ యూత్ మండలఅధ్యక్షుడు పన్నాల అంజిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను నిషేధించాలి

**మున్సిపల్ కమిషనర్ తిరుపతి**



కోరుట్ల మార్చి 26 ప్రజా జ్యోతి: దుకాణదారులు పండ్ల వ్యాపారులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను వాడవద్దని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ తిరుపతి అన్నారు. మంగళవారం పట్టణంలోని పండ్ల దుకాణాలు, కూరగాయల దుకాణాలు, వీధి వ్యాపారులు మరియు కిరాణా షాపులు మొదలగు వాటిని తనిఖీ చేసి, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉపయోగిస్తున్న వారికి జరిమానాలు విధించారు. వీరిని ఉద్దేశించి మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి మాట్లాడుతూ, వీధి వ్యాపారులు మరియు పండ్ల దుకాణాలు, కూరగాయల దుకాణం యజమానులు, కిరాణా షాపుల వారు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను బహిష్కరించి, పర్యావరణానికి మేలు కలిగే విధంగా సహకరించాలని కోరారు. లేనియెడల భారీ జరిమానాలు విధించి దుకాణాలను సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ అంజయ్య మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### 10వ తరగతి భౌతిక రసాయన శాస్త్రం పరీక్షకు 7,716 మంది హాజరు

**పెద్దపల్లి.డి.ఈ.ఓ డి.మాధవి**

పెద్దపల్లి, మార్చి –26: 10వ తరగతి భౌతిక రసాయన శాస్త్రం పరీక్షకు 7,716 మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా విద్యా శాఖ అధికారి డి.మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మంగళవారం నిర్వహించిన పదవ తరగతి భౌతిక రసాయన శాస్త్రం పరీక్షలో 7,728 మంది విద్యార్థులకు గాను 7,716 మంది విద్యార్థులు హాజరు కాగా, 99.8 శాతం హాజరు నమోదు అయినట్లు తెలిపారు. 3 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 12 పరీక్షా కేంద్రాలు, జిల్లా లెవెల్ అబ్జర్వర్ 3 పరీక్షా కేంద్రాలు, అసిస్టెంట్ కమిషనర్ పరీక్షల విభాగం 3 పరీక్షా కేంద్రాలను, డిఈఓ.3 పరీక్షా కేంద్రాలనుసందర్శించారని, మాల్ ప్రాక్టీస్ కేసులు బుక్ కాలేదని, భౌతిక రసాయన శాస్త్రం పరీక్ష ప్రశాంతంగా జరిగి నట్లు డి.ఈ.ఓ. మాధవి ఆ ప్రకటనలో తెలిపారు.

### లైసెన్సు కలిగిన తుపాకులు సరెండర్ చేయాలి

**రామగుండం పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్ ఐపిఎస్.,**



పెద్దపల్లి ప్రతినిధి, (ప్రజా జ్యోతి), మార్చి 26: రామగుండం పోలీస్ కమీషన రేట్ పరిధిలోని లైసెన్సు కలిగిన తుపాకులను వెంటనే సరెండర్ చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ ఐపిఎస్., మంగళవారం ఒక ప్రకటనలో ఆదేశాలు జారీచే శారు.ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికకు షెడ్యూలు విడుదలైన నేపథ్యంలో పోలీసుశాఖ ఈ మేరకు చర్యలు చేపట్టిందన్నారు. ఆయుధాల చట్టం 1959 సెక్షన్ 21 ప్రకారం.. కమిషనరేట్ పరిధిలో నివసిస్తూ, లైసెన్సు తుపాకులు కలిగి ఉన్నవారంతా సమీపంలోని పోలీ సుస్టేషన్‌లో డిపాజిట్ చేయాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా, ఎలాంటి హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల సందర్భంగా ముందస్తుగా ఆయుధాలు డిపాజిట్ చేయాలని. అలా చేయని వారిపై కేసులు పెట్టేందుకు వెనకాడమని సీపీ తెలిపారు. డిపాజిట్ చేసిన ఆయుధాలను ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం తిరిగి తేదీ: 07-06-2024 రోజున తీసుకోవచ్చని సూచించారు. ఈ విషయంలో జాతీయ బ్యాంకులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే భద్రతా సిబ్బంది, గార్డు డ్యూటీలో ఉన్నవారికి మినహాయింపు ఉంటుందని తెలిపారు.

### ఆంజనేయ స్వామికి వెండి గద భక్తుడి సమర్పణ



మల్యాల, మార్చి 26 (ప్రజాజ్యోతి) : మల్యాల మండలం ముత్యంపేట గ్రామం లోని శ్రీ కొండగట్టులో ఆంజనేయ స్వామికి మిట్టపల్లి గ్రామానికి చెందిన మల్లారెడ్డి అనే భక్తుడు స్వామివారికి 250 గ్రాముల వెండి గదను భక్తితో చేయించి ఆలయ అధికారులకు అందజేశారు.

### హుండీ లెక్కింపు

కొండగట్టు ఆంజనేయ స్వామికి భక్తితో భక్తులు సమర్పించిన కానుకల హుండీ లెక్కింపు బుధవారం రోజు అధికారుల సమక్షంలో జరుపబడు నని ఆలయ కార్యనిర్వహ అధికారి ప్రకటనలో తెలిపారు. ఆంజనేయ స్వామి పర్వదినమైన మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది అధికారులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు.



# ఆధ్యాత్మిక చింతనతోనే లక్ష్యాలు నెరవేరుతాయి

**పడి పూజలో మొక్కులు తీర్చుకున్న వొడితల ప్రణవ్**





జమ్మికుంట,మార్చి26( ప్రజా జ్యోతి): జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న 25వ వార్షికోత్సవ ద్వితీయ పుష్కర కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా పడిపూజ మహోత్సవంలో హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వొడితల ప్రణవ్ అయ్యప్ప స్వామి పడి పూజా కార్యక్రమంలో పాల్గొని అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ శ్రీ అయ్యప్ప స్వామి పుట్టినరోజున పడిపూజ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆధ్యాత్మిక చింతన తోనే అనుకున్న లక్ష్యాలు కోరికలు నెరవేరుతాయని, మనిషి జీవితంలో తప్పకుండా భగవంతుని నామస్మరణ చేయడం జరుగుతుందన్నారు. అయ్యప్ప దీక్ష కఠినమైన నిర్ణయాలతో కూడుకొని ఉండి అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలను జరిగాయని , మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా ఈ కార్యక్రమాలు నిర్వహించిన అయ్యప్ప కమిటీ సభ్యులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అయ్యప్ప స్వామి దేవాలయ అభివృద్ధికి దీప దూపా నైవేద్యాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని, తాను ఏ స్థాయిలో ఉన్న జమ్మికుంట అయ్యప్పను మరవపోనని అన్నారు.ఈ పడి పూజ కార్యక్రమంలో బ్రహ్మ శ్రీ వెంకటేశ్వర్లు గురు స్వామి ఆధ్వర్యంలో పడిపూజ మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో గురు స్వాములు సిరిమల్లె జయేందర్, మామిడాల మనోహర్ ,అనుమాస రాజేందర్, ప్రతాప్ రెడ్డి,మిల్కూరి తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, ప్రభాకర్ రావు, ఇమ్మడి భాస్కర్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

# 72 మస్జిద్లలో ఉచితంగా 625 క్యాన్ల చల్లని నీరు పంపిణీ

**ఉపవాస దీక్షలు పాటించే ముస్లింల సౌకర్యార్థం**
**ఎంఐఎం నగర అధ్యక్షుడు**
**గులాం అహ్మద్ ఉదారత**



కరీంనగర్, మార్చి 26 ప్రజా జ్యోతి: పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు పాటించే ముస్లింల సౌకర్యార్థం, నగరంలోని 72 మస్జిద్ లలో నెల రోజుల పాటు రంజాన్ మాసం మొత్తంలో ప్రతి రోజు 625 కూల్ క్యాన్ల నీరును ఉచితంగా అందించి ఉదారతను చాటుతున్నారు ఎంఐఎం నగర అధ్యక్షుడు.. తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్. ప్రతియేటా గణేష్ నిమజ్జనం రోజున రాజీవ్ చౌక్ లో జమ్మత్ వెల్ఫేర్ సొసైటీ పేరిట నిమజ్జనం లో పాల్గొనే..నిమజ్జనం చూసేందుకు వచ్చే వేలాది హిందూ సోదర సోదరీమణులకు కూల్ వాటర్ బాటిల్స్, బాదం మిల్క్, లస్సీ, బటర్ మిల్క్, కూల్ డ్రింక్స్ వంటి శీతల పానీయాలను అందిస్తూ..గంగా జమున తెహజీబ్ ను రక్షించేందుకు.. దేశ ప్రజల మధ్య కొన్ని మతతత్వ శక్తులు విద్వేషాలు నూరి పోస్తున్న తరుణంలో దేశంలోనే తొలిసారిగా హిందు ముస్లిం ఐక్యతకు చిహ్నంగా కరీంనగర్ కు గుర్తింపు తీసుకొచ్చి..అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందారు. గత కొన్ని సంవత్సరాలుగా పవిత్ర రంజాన్ మాసంలో..దైవభీతి తో..నిష్ట తో నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటించే ముస్లిం సోదరులకు వేసవికాలం దృష్ట్యా..ఉపవాసం ముగింపు సమయంలో చల్లని నీటిని అందించాలనే దృఢ సంకల్పంతో నగర వ్యాప్తంగా 72 మస్జిద్ లలో ప్రతి రోజూ 625 కూల్ క్యాన్ల చల్లని త్రాగునీటిని ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. నగర నలు మూలాల నాలుగు వాటర్ ప్లాంట్ ల నుండి సరఫరా చేస్తున్నామన్నారు. ఈసందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ అల్లాహ్ మెప్పు కోసం, సేవాగుణం తో, సమాజంలో మరి కొందరికి స్ఫూర్తిగా నిలిచేందుకు మాత్రమే తాను ఈ కార్యక్రమాన్ని చేస్తున్నానని వెల్లడించారు. బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ, అక్బరుద్దీన్ ఓవైసీ ల కోసం, ఎంఐఎం పార్టీ దేశ వ్యాప్తంగా అభివృద్ధి చెందాలని ప్రతి ఒక్కరూ ప్రత్యేక ప్రార్థనల్లో గుర్తు ఉంచుకొని దుఆ చేయాలని కోరారు.

# అంగరంగ వైభవంగా వేంకటేశ్వర స్వామి వారి రథోత్సవం

**రథబలి హరణం, వేద మంత్రోచ్చరణల నడుమ రథయాత్ర**
**ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు**
**జాతరలో పాల్గొన్న భక్తులు,గ్రామస్తులు**





మెట్ పల్లి ప్రతినిధి మార్చ్ 26 ( ప్రజా జ్యోతి) : జగిత్యాల జిల్లాఇబ్రహీంపట్నంమండలంలోని వేములకుర్తి గ్రామంలో అతిపురాతన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి రథయాత్ర అంగరంగ వైభవంగా జరిగింది.యజ్ఞ అర్చకులు చక్రపాణి, నర్సింహమూర్తి చార్యులు, స్వామివారి మూలవిరాట్ కు పంచామృతలతో అభిషేకం చేసి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి రథయాత్ర కోసం బలిహరణం చేసి వెంకటేశ్వర స్వామి, అలివేలు మంగమ్మ లను రథంలోకి తీసుకొచ్చి రథబలితదితరపూజలనువేదమంత్రోచ్చరణల మధ్య నిర్వహించారు. అనంతరం గ్రామంలోస్వామి వారి రథయాత్ర ఘనంగా జరిగింది. స్వామి వారు ఆలయంకు చేరిన తర్వాత అర్చకులు స్వామి వారి ఉత్సవ మూర్తులను మోస్తూ నృత్యం చేశారు.అనంతరం పండిత సత్కారం జరిగింది, జాతర వేడుకలలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ రథోత్సవ వేడుకకు దేవలయకమిటీ సభ్యులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు,ప్రజాప్రతినిధులు ,మహిళలు వివిధ గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.

# ఇందిరమ్మ రాజ్యంలో రుణ మాపి ఏమైంది?

**చెవిలో పువ్వులు పెట్టే విధంగా జీవన్ రెడ్డి మాటలు**
**నిజామాబాద్ ఎంపి అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి**



జగిత్యాల టౌన్/ రూరల్/ అర్బన్, మార్చి 26 (ప్రజా జ్యోతి): జగిత్యాల పట్టణంలోని బీఎలఎన్ గార్డెన్స్ లో జగిత్యాల టౌన్, రూరల్, అర్బన్ మండలాలకు చెందిన ముఖ్య కార్యకర్తల సమావేశం జగిత్యాల పట్టణం దేవిశ్రీ గార్డెన్స్ లో జగిత్యాల పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశానికి నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి హాజరై కార్యకర్తల్ని ఉద్దేశించి మాట్లాడుతూ నిజామాబాద్ పార్లమెంట్ లో గులాబీ జెండా ఎగరేయాలని పార్లమెంట్ లో తెలంగాణ వాణిని వినిపించాలంటే బిఆర్ఎస్ గెలవాలని అన్నారు. కాంగ్రెస్ బీజేపీ డూప్లికేట్ పార్టీలని అరచేతిలో స్వర్గం చూపే పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. బిఆర్ఎస్ పార్టీనీ ఎన్నికల్లో ఎదుర్కోలేకనే తప్పుడు కేసులు పెడుతున్నారని అరవింద్ ఒక సోషల్ మీడియా యాక్టర్ అని మండిపడ్డారు. ప్రజల చెవిలో పువ్వులు పెట్టే విధంగా జీవన్ రెడ్డి మాటలు ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ దావ వసంత సురేష్, మాజీ మంత్రి జి. రాజేశం గౌడ్, గట్టు సతీష్, బాలముకుందం తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి**
**ప్రణాళికాబద్ధంగా యాసంగి ధాన్యం కొనుగోలు**
**నాణ్యమైన ధాన్యాన్ని చివరి గింజ వరకు**
**మద్దతు ధర పై కొనుగోలు**
**వానాకాలం పంట సీఎంఆర్ రా రైస్ డెలివరీ పై**
**కలెక్టర్ లు ప్రత్యేక దృష్టి సారించాలి**
**త్రాగునీటి సరఫరా ఇబ్బందులు రాకుండా**
**అప్రమత్తంగా ఉండాలి**
**ధాన్యం కొనుగోలు, త్రాగునీటి సరఫరాపై కలెక్టర్ లతో**
**వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన**
**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి**






పెద్దపల్లి ప్రతినిధి, (ప్రజా జ్యోతి), మార్చి –26: యాసంగి 2023–24 ధాన్యం వరి కోతల షెడ్యూల్ ప్రకారం జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి హైదరాబాద్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి ధాన్యం కొనుగోలు, వేసవిలో త్రాగునీటి సరఫరా ప్రణాళికపై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ లతో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ, యాసంగి పంట కోతలకు వస్తున్న నేపథ్యంలో జిల్లా స్థాయిలో వరి కోతల ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తననియమావళిని అనుసరిస్తూ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాల్సి ఉంటుందని, అధికారులు మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవం చేయాలని, ఎక్కడా ప్రజా ప్రతినిధులు పాల్గొనవద్దని అన్నారు. ప్రతి జిల్లాలో వరికోతలననుసరించి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు షెడ్యూల్ రూపోందించుకోవాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కల్పించాల్సిన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎస్ తెలిపారు. యాసంగి పంట కొనుగోలుకు రాష్ట్ర వ్యాప్తంగా 7149 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాల్సి ఉంటుందని, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌళిక వసతులు కల్పించాలని, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని త్రాగునీటి సరఫరా, టెంట్లు వంటి ఏర్పాట్లు చేయాలని సి.ఎస్. అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ప్యాడి క్లీనర్లు, తేమ యంత్రాలు, వెయింగ్ యంత్రాలు, టార్ఫాలిన్లు, గన్ని బ్యాగులు సన్నద్ధం చేసుకోవాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలు, సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో రైస్ మిల్లులకు రవాణా చేసేందుకు అవసరమైన వాహనాలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. చివరి గింజ వరకు నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధరపై ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఎక్కడ తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన అవసరం లేదనే సందేశం రైతుల వద్దకు వెళ్లేలా అవగాహన కల్పించాలని, భారత ఆహార సంస్థ నిర్దేశించిన ధాన్యం నాణ్యత ప్రమాణాలు, తేమ శాతంపై విస్తృత అవగాహన కల్పించాలని, రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టుకొని నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకుని వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి సంబంధిత మిల్లర్లకు కేటాయించాలని, రైస్ మిల్లు వద్ద ఎట్టి పరిస్థితుల్లో ధాన్యం కోత రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైస్ మిల్లర్ల వద్ద హమాలీల కొరత రాకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం రైతులు ధాన్యాన్ని తీసుకుని వచ్చే విధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో వరిసాగు చేస్తున్న రైతులకు సమీపంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ట్యాగింగ్ చేయాలని, ప్రణాళిక బద్ధంగా కొనుగోలు కేంద్రం వద్దకు రైతు ధాన్యం తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వానాకాలం 2023–24 కు సంబంధించి సీఎంఆర్ రా రైస్ డెలివరీ వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని, భారత ఆహార సంస్థ నిర్దేశించిన సమయానికి రైస్ డెలివరీ చేసే విధంగా ప్రతి జిల్లాలో రైస్ మిల్లుల పనితీరును ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని, ప్రతిరోజు రైస్ మిల్లులు పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిచేలా చూడాలని, సిఎంఆర్ రా రైస్ డెలివరీ పై కలెక్టర్ లు ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉంటుందని సిఎస్ పేర్కొన్నారు. వేసవి కాలంలో త్రాగునీటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ త్రాగునీటి సరఫరాలో వచ్చే చిన్న చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డు స్థాయిలో త్రాగునీటి సరఫరాకు ప్రణాళికలు తయారు చేసుకోవాలని, త్రాగునీటి పైప్ లైన్ లీకేజీలు అరికట్టాలని తెలిపారు. జిల్లాలో త్రాగునీటి అవసరాల మేరకు బోరు బావులను, పాత త్రాగునీటి సరఫరా మోటార్లను పునరుద్ధరించాలని, త్రాగునీటి సరఫరా నిమిత్తం అవసరమైన పనులను వెంటనే చేపట్టాలని, ఎక్కడ నిధులకు ఆటంకం లేనందున అత్యంత ప్రాధాన్యతతో త్రాగునీటి సరఫరా పనులు పూర్తి చేయాలని అన్నారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ పరిధిలో ఉన్న త్రాగునీటి వ్యవస్థను ఒకసారి పరిశీలించి అవసరమైన మరమ్మత్తులు పూర్తిచేయాలని తెలిపారు. త్రాగునీటి సరఫరాలో ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు సన్నద్ధం కావాలని ప్లాన్ బీ తయారు చేసుకోవాలని అన్నారు. ప్రతి మున్సిపాలిటీలో చివరి వార్డ్, గ్రామాలలో చివరి ప్రాంతం వరకు త్రాగునీటి సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, త్రాగునీటి సరఫరాకు సంబంధించిన ప్రతి అంశాన్ని రోజు పర్యవేక్షించాలని, ప్రజలకు నీటి సరఫరా లో అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నయ ఏర్పాట్లు సత్వరమే చేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, పెద్దపెల్లి జిల్లాలో 3 లక్షల 4 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు 305 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నామని, ఏప్రిల్ 1 నుంచి ఏప్రిల్ 10 వరకు దశల వారీగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు ప్రణాళిక తయారు చేసుకున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మేర ప్యాడి క్లీనర్లు వేయింగ్ యంత్రాలు , తేమ యంత్రాలు, ఇతర సామాగ్రి సన్నద్ధం చేస్తున్నామని, వేసవి దృష్ట్యా అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని, ఎన్నికల దృష్టిలో ఉంచుకొని ఎన్నికల ప్రవర్తన నియమావళి కట్టుదిట్టంగా అమలయ్యే విధంగా జాగ్రత్తలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఖరీఫ్ 2023–24 సీజన్ కు సంబంధించి సీఎంఆర్ రా రైస్ డెలివరీ సకాలంలో పూర్తి చేసే విధంగా రైస్ మిల్లులను పర్యవేక్షిస్తా మని అన్నారు. జిల్లాలో ఉన్న రైస్ మిల్లులు పూర్తి స్థాయి సామర్థ్యంతో నడిచి ప్రతి రోజూ నిర్దేశించుకున్న లక్ష్యాల మేరకు భారత ఆహర సంస్థకు రా రైస్ డెలివరీ సరఫరా చేస్తామని అన్నారు. వీడియో సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ, జిల్లాలో ఏర్పాటు చేయబోయే 305 ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం దిగుబడి ప్రకారం అవసరమైన మేర ప్యాడి క్లీనర్లు, డీజీటల్ కాంటాలు, టార్ఫాలిన్లు ఏర్పాటు చేసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డి.ఎస్. ఓ. ప్రేమ్ కుమార్, డి.సి. ఓ. శ్రీమాల, డి.ఆర్.డి.ఓ. రవీందర్, జెడ్పీ సి.ఈ.ఓ. నరేందర్, మార్కెటింగ్ జిల్లా అధికారి ప్రవీణ్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆది రెడ్డి, కలెక్టరేట్ ఏ. ఓ. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



## సబ్ రిజిస్టర్ కార్యాలయంలో నిర్వహణ సక్రమంగా చేపట్టాలి

**డిఐజి సుభాషిణి తనిఖీ**
**ఆకస్మిక తనిఖీ చేసిన డీఐజీ సుభాషిణి**

వేములవాడ, మార్చి 26, (ప్రజాజ్యోతి): వేములవాడ సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని వరంగల్ స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ డిఐజి సుభాషిణి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డు రూమును, కంప్యూటర్ విభాగాన్ని, పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకొని, వార్షిక తనిఖీల్లో భాగంగా కార్యాలయాన్ని తనిఖీ చేయడం జరిగిందని తెలిపారు. సబ్ రిజిస్టర్ కార్యాలయంలో నిర్వహణ సక్రమంగా చేపట్టాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి వచ్చిన ప్రజలతో మాట్లాడి ఏమైనా ఇబ్బందులు ఉంటే సబ్ రిజిస్టర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఆమె వెంట సబ్ రిజిస్టర్ చెర్ల సురేంద్రబాబు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

## దర్యాప్తు సంస్థల పేరుతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మోడీ

**కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చీటీ ఉమేష్ రావు**

సిరిసిల్ల, మార్చి 26, (ప్రజాజ్యోతి): దర్యాప్తు సంస్థల పేరుతో ప్రజాస్వామ్యాన్ని ప్రధాని మోడీ ఖూనీ చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చీటీ ఉమేష్ రావు అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఉమేష్ రావు అధ్వర్యంలో మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలక్ట్రోరల్ బాండ్ల విషయంలో సుప్రింకు సమాధానం చెప్పలేకే మోఢీ కోరారన్నారు. ప్రజల చేత ఏనుకోబడిన ప్రభుత్వాలను కూల్చడమే మోఢీ పని కట్టుకున్నారన్నారు. ఎన్నికలోచ్చాయంటే చాలు దేవుళ్ళ పేరీట యాత్రలు తప్ప, బండి సంజయ్ చేసింది ఏమిలేదన్నారు. ఎంపిడిఓ, కలెక్టర్ తో మాట్లాడలేని 'బండిసంజయ్ "కార్పోరేటర్ కే కరెక్ట్ అని అన్నారు. ఏలక్ట్రోరల్ బాండ్లు రాజ్యాంగ వ్యతిరేకమని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును దేశం మొత్తం స్వగతించిందన్నారు. ప్రపంచంలోనే చాలా తెలివైనా స్కామని, ఈ స్కాం గురించి దేశ వ్యాప్తంగా ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ బాండ్ల విషయంలో పారదర్శకత ఉండాలని, ఎవరేవరు ఏంత ఇచ్చారనే సమాచారం బహిర్గతం చేయాలని సుప్రీం ఆదేశిస్తే, అందుకు జూన్ 30 వరకు బిజెపి ప్రభుత్వం గడువుకోరిందని తెలిపారు. దేశంలోని మిగత పార్టిలన్ని కలిపి ఈ బాండ్ల రూపంలో 12వేల కోట్లు తీసుకోంటే, బిజెపి మాత్రం 26వేల566కోట్ల రూపాయలు తీసుకోందని ఆరోపించారు. బాండ్ల రూపేనా తీసుకున్న మొత్తంలో బిజెపి 55 శాతం తీసుకుందని ధ్వజమేత్తారు. దేశంలో భడ భడ బాబులకు ముందస్తూ కాంట్రాక్టులిచ్చి వేల కోట్లు దండుకున్నారని విమర్శించారు.41 కార్పోరేట్ కంపనీల పై 56 రైడింగులు చేయించి 1853 కోట్లు దండుకున్నారన్నారు. ఇదిలా ఉండగా కరీంనగర్ ఏం.పి బండి సంజయ్ కి కనీసం ఎంపీడీవో, కలెక్టర్ తో మాట్లాడే అవగాహన లేదని, ఆయన కార్పోరేటర్ కే



కరెక్టని వ్యంగస్త్రాలు సందించారు. ఎన్నికలు సమీపిస్తే చాలు మతం పేరిట, దేవుని పేరిట యాత్రలు చేయడం యువతను తప్పుదారి పట్టించడమే సంజయ్ పనని పేర్కొన్నారు. దేశంలో రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చడమే బిజేపి పనిగా పెట్టుకుందని, రానున్న ఎన్నికల్లో బిజెపి బుద్ది చెప్పాలని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కూతురు వెంకట్ రెడ్డి, ఎన్ఐసిఐ సీనియర్ నాయకులు భూపాల్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గడ్డం మధుకర్ చోటు, శ్రీరాముల వెంకటేష్, వెంగళ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## శివ కళ్యాణంకు ముస్తాబైన రాజన్న క్షేత్రం

వేములవాడ, మార్చి 26, (ప్రజాజ్యోతి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం మార్చి 27 నుండి 31వ వరకు ఐదు రోజుల పాటు నిర్వహించే శివ కళ్యాణ మహోత్సవంకు ముస్తాబయింది. మార్చి 28 గురువారం 10.50 నిమిషాల నుండి 12.55 నిమిషాల వరకు శ్రీపార్వతీరాజరాజేశ్వర స్వామి కళ్యాణమహోత్సవము చైర్మన్ గెస్ట్ హౌస్ ముందు భాగంలో నిర్వహించుటకు కళ్యాణవేదిక ఏర్పాటు చేశారు. ఆలయ విమాన గోపురానికి, ఆలయ ఆవరణలో విద్యుటదీపాల ఏర్పాటు చేశారు. శివకళ్యాణ మహోత్సవంకు చలువ పందిర్లు, క్యూలైన్లు, కల్యాణ, ఇతరత్రా ఏర్పాటుచేశారు. మార్చి 30 శనివారం సాయంత్రం 3.05 నిమిషాల నుండి శ్రీ స్వామివారి రథోత్సవము నిర్వహించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



# పెద్దపల్లి ఎంపీ టికెట్ పై పునః సమీక్ష చేయాలి

**ఏప్రిల్ 5 న అమర నిరాహార దీక్ష**
**కష్టపడ్డ కార్యకర్తలను విస్మరించడం తగదు**
**విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి ఊట్ల వరప్రసాద్**



సుల్తానాబాద్, మార్చ్ 26 ( ప్రజా జ్యోతి): పార్లమెంటు టికెట్ ప్రకటనపై కాంగ్రెస్ పార్టీ అధిష్టాన వర్గం పునః సమీక్ష చేయాల్సిన అవసరం ఉందని యూత్ కాంగ్రెస్ మాజీ జాతీయ కార్యదర్శి పార్లమెంటు అధ్యక్షులు ఉట్ల వరప్రసాద్ కోరారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు కాంగ్రెస్ పార్టీ కష్ట కాలంలో అండగా నిలిచి అనేక పోరాటాలు చేసిన వారిని కాకుండా ప్యారాచూట్ వారికి టిక్కెట్లు కేటాయించడం ఏమిటని అన్నారు . మంత్రి శ్రీధర్ బాబు ఎమ్మెల్యేలు విజయ రమణారావు మక్కాన్ సింగ్ తోపాటు కార్యకర్తల ప్రజాప్రతినిదుల అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయం ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. కార్యకర్తలు నాయకులు ప్రజాప్రతినిధులు స్థానికులకే అవకాశం కల్పించాలని డిమాండ్ ను పార్టీకి మంత్రి ఎమ్మెల్యేలు చెప్పినప్పటికీ పెడచెవిన ఎలా పెడతారని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో రాజకీయ వారసులు వెంకటస్వామికి తామేనని ఆస్తులకు మాత్రమే ఎమ్మెల్యే వివేక్ కుటుంబం, సభ్యులు మాత్రమే ఉంటారని వివరించారు.. ఏప్రిల్ 5వ తేదీన పెద్దపల్లి జిల్లా కేంద్రంలో అమర నిరాహార దీక్ష చేపడుతున్నట్లు వివరించారు. పెద్దపల్లి ఎంపీ టికెట్ వచ్చుడో.. వరప్రసాద్ సచ్చుడో.. అని నినాదంతో ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ కుటుంబ పాలనపై కాంగ్రెస్ పార్టీ కొట్లాడి అధికారుల్లోకి వచ్చిందని అది మరిచి , ఇదే వివేక్ కుటుంబ సభ్యుడికి ఎలా పంపిస్తారని తెలిపారు కాంగ్రెస్ లోని కొందరు వారిని ఎందుకు ప్రోత్సహిస్తున్నారో అందరికీ తెలుసని ,కుటుంబ పాలనపై కాంగ్రెస్ కొట్లాడి తెలంగాణలో అధికారం చేపట్టిన సందర్భంగా, పెద్దపల్లి పార్లమెంటు టికెట్ ను ఒకే కుటుంబానికి చెందిన నాయకులకు పంపిణీ చేయడం శోచనీయమన్నారు . ఇప్పటికైనా పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణను మార్చి మాదిగలకు అవకాశం కల్పించాలని కోరారు.ఈ సమావేశంలో సుల్తానాబాద్ మాజీ జెడ్పిటిసి సభ్యురాలు ఊట్ల రమ, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.



## ఉద్యమ కేసులు ఎత్తి వేయాలి

**పార్టీ నాయకులు చొక్కాల రాము**

సిరిసిల్ల, మార్చి 26, (ప్రజాజ్యోతి): రాజన్న సిరిసిల్ల ఏర్పాటు కోసం పోరాటం చేసిన ఉద్యమ కారులపై ఉన్న కేసులుఎత్తివేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు చొక్కాల రాము అన్నారు. మంగళవారం ఉద్యమం కోసం పోరాడినఉద్యమకారులు కంపాల మల్లేశం, ఎస్సీ ఎస్టీ ప్లాన్ జిల్లా అధ్యక్షులు చొక్కాల రాము, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్నా వీర వేడి మల్లేశం యాదవ్, మైలారం తిరుపతి, ఎండి సలీంలు కోర్టుకు హాజరయ్యారు.ఈ సందర్భంగా చొక్కాల రాము మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పడితే బడుగు బలహీన . వర్గాలు అభివృద్ధి,స్థానికంగా జిల్లా ఆఫీస్ లు వస్తే పేద ప్రజలకు అందుబాటులో ఉంటుందని, సిరిసిల్ల జిల్లా అభివృద్ధి చెందుతుందనినాడు పోరాటం చేయడం జరిగిందన్నారు. సిరిసిల్ల జిల్లా అఖిలపక కమిటీ జిల్లా ఏర్పడి 10 సంవత్సరాల దగ్గరకువస్తున్న ఇప్పటివరకు జిల్లా ఉద్యమ కేసులో కోర్టు చుట్టూ తిరుగుడం జరుగుతుందన్నారు. నాడు సిరిసిల్ల జిల్లా కోసంజైలుకు పోవడం జరిగిందని గుర్తు చేశారు. జిల్లా ఏర్పాటు అనంతరం సిరిసిల్ల అభివృద్ధి చెందింది కానీ, ఉద్యమకారుల పైకేసులు ఎత్తి వేయడం లేదన్నారు.

## సీఐఆర్ఎఫ్ ద్వారా సులువుగా గుర్తించవచ్చు


**ఎస్సై బి రామ్మోహన్**



గంభీరావుపేట మార్చ్ 26 (ప్రజా జ్యోతి): గంభీరావుపేటకు మండల కేంద్రానికి చెందిన ఎండి హైమద్ పాష గత కొద్ది రోజుల క్రితం తన మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో పిర్యాదు ఇవ్వగా సీఐఆర్ఎఫ్ ద్వారా తన మొబైల్ ఫోన్ ని గుర్తించి తనకి ఈరోజు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్సె మాట్లాడుతూ ఎవరైనా తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నట్లయితే సి ఐ ఆర్ ఎఫ్ అప్లికేషన్ ద్వారా సులువుగా గుర్తించవచ్చని ఇట్టి సేవలు ప్రజలు వినియోగించుకోగలరని తెలిపారు.

## అగ్రహారం హనుమాన్ ఆలయ హుండీ లెక్కింపు

వేములవాడ, మార్చి 26, (ప్రజాజ్యోతి): వేములవాడ మండలం అగ్రహారం శ్రీహనుమాన్ ఆలయ 3 నెలల హుండీ లెక్కింపును మంగళవారం నిర్వహించారు. ఈ హుండీ లెక్కింపులో నగదు రూ. 2,21,877 వచ్చినట్లు కార్యనిర్వహణాధికారి ఎండపల్లి మారుతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక వంశీయ ధర్మకర్త గౌరిశెట్టి మహేందర్, ఆలయ మాజీ ధర్మకర్త చేపూరి నాగరాజు, ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎండపల్లి మారుతి, హుండీ పరిశీలకులు నాగారపు శ్రీనివాస్ యాదవ్, ఆలయ అర్చకులు, సిబ్బంది, సత్య సాయి సేవ సమితి (సిరిసిల్ల శాఖ) భక్తులు పాల్గొన్నారు.



## ముత్తారం మండలంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ ఎండిన పంటల పరిశీలన

**మార్పు అంటే పచ్చని పొలాలను ఎండబెట్టడమేన**
**ఎండిన పంటలకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలే**
**మాజీ మంత్రి..ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్**



ముత్తారం మార్చ్ ,26 (ప్రజా జ్యోతి) మంగళవారం ముత్తారం మండలం సీతంపల్లి, రామకృష్టాపూర్ గ్రామాల్లో ఎండిన పంటలను జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ తో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల రైతులతో మాట్లాడి నేటి పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ యాసంగిపంటకు సాగునీరు ఇవ్వలేమని ముందుగానే కాంగ్రెస్ ప్రభుత్వం, పాలకులు ప్రకటిస్తే రైతులు పంటలు సాగు చేసి నష్టపోయే వారు కాదన్నారు. సాగునీరు అందిస్తామని చెప్పడంతో రైతులు పంటలు సాగు చేసుకున్నారని, ఈనాడు సాగునీరు ఇవ్వమంటే ఇవ్వలేని దుస్థితి కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. ఆనాడు రైతుల కష్టాలను ఆలోచించి కాల్వలు తవ్వించి ప్రాజెక్టులు నిర్మించి సాగునీటి కష్టాలు తీర్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్కే దక్కుతుందన్నారు. గత ఏడాది యాసంగి సమయంలో ప్రతి బోరు, ప్రతి చెరువు నిండుగానే ఉన్నాయని, రైతులకు పుష్కలమైన నీరు అందించామని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ నీళ్లు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మార్పు వస్తుందని గొప్పలు చెప్పారని, మార్పు అంటే పచ్చగా ఉండే పంట పొలాలను ఎండబెట్టడమేనా అని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన మూడు మాసాల్లో రాష్ట్ర వ్యాప్తంగా 138మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఆత్మహత్యలు లేని తెలంగాణగా తీర్చిదిద్దుకున్నామన్నారు. సాగునీరు లేక ఎండిన పొలాలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు అధైర్యపడవద్దు అండగా ఉంటాం అని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్ మాట్లాడారు కరెంటు, సాగునీరు లేక పంటలు ఎండిపోయిన రైతులు అధైర్యపడవద్దని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ముత్తారం మండలం సీతంపల్లి, రామకృష్టాపూర్ గ్రామాల్లో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్తో కలిసి ఆయన ఎండిన పంటలను పరిశీలించిన ఆయన మార్పు అంటే ఇంత గొప్పగా ఉంటుందని ఎవరూ ఊహించలేదన్నారు. పదేళ్ల క్రితం సమైఖ్యాంధ్ర పరిపాలనతో ఎలా ఉండేదో అవే పరిస్థితులు మళ్లీకన్పిస్తున్నాయని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి నాయకులు ఏన్ని కష్టాలు పెట్టారో ఇప్పుడు అవే కష్టాలు ఎదురైతున్నాయి. రైతులు ఎన్ని కష్టాలు పడ్డా ఈ ప్రభుత్వానికి అవసరం లేదన్నారు. పంటలు ఎండిపోయి కష్టాల్లో ఉన్న రైతులను కలిసి ధైర్యం చెప్పాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు తాము ఎండిన పంటలను పరిశీలించి ధైర్యం చెబుతున్నామని అన్నారు. ఆయా గ్రామాల్లోని బీఆర్ఎస్ నాయకులు , రైతు నాయకులు ఎండిన పంటను అంచనా వేసి తమకు అందజేయాలని, బీఆర్ఎస్ పార్టీ పక్షాన న్యాయం జరిగేవరకు పోరాడుతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జక్కుల ముత్తయ్య, వైస్ ఎంపీపీ రవీందర్రావు, మండల పార్టీ అధ్యక్షుడు పోతి పెద్ది కిషన్ రెడ్డి, గుజ్జుల రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ నూనె కుమార్, తగరం శంకర్ లాల్, మండల కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## ప్రజల్లో నమ్మకాన్ని చేకూర్చేలా బిఎస్ఎఫ్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ ర్యాలీ

**బి ఎస్ ఎఫ్ పోలీసులకు మంగళ హారతి తో,పూలతో స్వాగతం పలికిన మహిళలు**
**పార్లమెంట్ ఎన్నికలలో అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి**
**జమ్మికుంట రూరల్ సీఐ కిషోర్, ఇల్లందకుంట ఎస్సై రాజ్ కుమార్,**



జమ్మికుంట, మార్చి 26(ప్రజా జ్యోతి) తెలంగాణ రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఇల్లందకుంట పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బిఎస్ఎఫ్ ఫోర్స్ ఫ్లాగ్ మార్చ్ ర్యాలీ ఇల్లందకుంట మండలంలోని సిరిసేడు గ్రామంలో నిర్వహించారు..ఫ్లాగ్ మార్చ్ లో బిఎస్ఎఫ్ పోలీసు బలగాలకు గ్రామాల్లో మహిళలు,మంగళహారతి ఇచ్చి, వీర తిలకం దిద్దుతూ ర్యాలీలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జమ్మికుంట రూరల్ సి ఐ కిషోర్ మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల భాగంగా ప్రజల్లో ఓటుపై నమ్మకాన్ని, విశ్వాసన్ని కల్గించే దిశగా పోలిస్, బిఎస్ఎఫ్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరుగుతుందని తెలపారు.ఓటర్లు ఎలాంటి భయ భ్రాంతులకు గురికాకుండా స్వేచ్ఛ గా వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని అన్నారు.ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం ఇల్లందకుంట ఎస్సె రాజ్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలను అతి సమస్యాత్మకంగా ఉన్న వాటిని గుర్తించినందున ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రజలందరూ స్వతంత్రంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట రూరల్ సీఐ కిషోర్, ఇల్లందకుంట ఎస్సె రాజ్ కుమార్, పోలీస్ శాఖ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





## పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

**సీఐ వెంకటేశ్వర్లు**

రుద్రంగి మార్చ్ 26 ప్రజా జ్యోతి: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలని చందుర్తి సిఐ బి. వెంకటేశ్వర్లు అన్నారు..మంగళవారం రుద్రంగి పోలీసు స్టేషన్ లో అన్ని రాజకీయ పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎలక్షన్ లో రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలన్నారు..సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు భారత ఎన్నికల సంఘం సూచించిన ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రుద్రంగి ఎస్ఐ అశోక్,హెడ్ కానిస్టేబుల్స్ పద్మారావు,బాపురెడ్డి, రైటర్ శ్రీనివాస్ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.